సమావేశంలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు

■ పథకాల అమలు నిరంతర ప్రక్రియ ■ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, డిసెంబర్ 28: అర్హులందరికీ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, ప్రజలు ప్రజా పాలన సభల్లో దరఖాస్తు చేసుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి సూచించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ 138వ ఆవిర్భావ వేడుకలను జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో 100 రోజుల్లో అమలు చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఫ్రీ ప్రయాణం, ఇంకా పేదలందరికీ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు అమల్లోకి తెచ్చామన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి గృహజ్యోతి కింద లబ్ధి కల్పిస్తామని, రూ.500కే సిలిండర్, రైతు భరోసా, మహాలక్ష్మి పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డు జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని, లబ్ధిదారులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తారని నిజామాబాద్ ఎంపీ అరవింద్ వ్యాఖ్యలపై స్పందించారు. రాష్ట్రంలో అప్పుల్లో ఉన్న మాట వాస్తవమేనని, ఆరు గ్యారంటీల అమలుకు ఆదాయ మార్గాలు పెంపొందించుకోవాలన్నారు. దుబారా తగ్గించి, అవినీతిని అరికడుతామన్నారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు విజయలక్ష్మీ, గిరి నాగభూషణం, కొత్త మోహన్, బండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మేడిపల్లి : ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

■ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, డిశంబర్ 28 : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ అన్నారు. మేడిపల్లి మండల కేంద్రం, పోరుమల్ల గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హమీలను అమలు చేస్తామని అన్నారు. ప్రభుత్వం కొలువు దీరిన 48 గంటల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ కింద సాయం రూ.10 లక్షల పెంపు వంటివి అమలు చేశామన్నారు. ప్రజాపాలన గ్రామ సభలో దరఖాస్తులు సమర్పించనివారు జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సమర్పించాలని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన మేడిపల్లి, భీమారం మండలాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, ఎంపీపీ దోనకంటి ఉమాదేవి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, సర్పంచులు క్యాతం వరలక్ష్మి, తౌటి తిరుపతి రెడ్డి, ఎంపిటీసీ అంకం వినోద, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్, తహసీల్దార్ వసంత, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళ నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న విప్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

■ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి/వెల్గటూర్, డిసెంబర్ 28: ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజల ఆర్థిక స్వావలంబన కోసం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి ప్రజల ముంగిట్లోకి అధికారులు వస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పలువురి నుంచి లక్ష్మణ్‌కుమార్ స్వయంగా దరఖాస్తులు స్వీకరించి అధికారులకు అందజేశారు. దరఖాస్తుదారులకు రశీదు తప్పనిసరిగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ప్రజాపాలన ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ రమేశ్, ప్రజాపాలన మండల ఇన్‌చార్జి రాహుల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు అయ్యోరి వేణు, తిర్మందాసు అశోక్, జక్కు పద్మ–రవీందర్, వేముల నాగలక్ష్మి–రాజేశ్, యూనస్, వొడ్నాల ఉమాలక్ష్మి, అనంతుల విజయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు అప్పాల వసంత్ తదితరులు పాల్గొన్నారు. వెల్గటూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు.

జగిత్యాల ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న అధికారులు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 28: జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్‌కుమార్ రెండోసారి విజయం సాధించడంపై జగిత్యాల వ్యవసాయ మార్కెటింగ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గురువారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ జిల్లా మార్కెటింగ్ అధికారి డీ ప్రకాశ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునీందర్, అధికారులు టీ రాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

■ పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

ప్రత్యేక పూజలు చేస్తున్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్, డిసెంబర్ 28: ఓబులాపూర్ గ్రామంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక అయ్యప్ప పడిపూజను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి పీసుపాటి పాపారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు హాజరయ్యారు. ఇక్కడ సర్పంచ్ అలిశెట్టి రవి, సేవా సమితి సభ్యులు తోట రాజిరెడ్డి, రాజు, రమేశ్, రాజ్‌కుమార్, రవి, నర్సారెడ్డి, ప్రదీప్, భరత్‌కుమార్, నారాయణ గంగాధర్, రాజేశ్, రమేశ్, మురళి పాల్గొన్నారు.

ప్రజా పాలన సభలకు పటిష్ట భద్రత

■ జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 28: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అమలు చేస్తున్న ప్రజాపాలన సభల్లో ఎక్కడా ఇబ్బందులు రాకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టామని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. సభలు జరుగుతున్న తీరు, భద్రతా చర్యలను ఎస్పీ గురువారం పరిశీలించారు. ప్రజలు స్వేచ్ఛగా వచ్చి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి, జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ ఉన్నారు.

రాముడిని ఆదర్శంగా తీసుకుంటా..

జగిత్యాల, డిసెంబర్ 28: రాముడిని ఆదర్శంగా తీసుకుని, ఆయన బాటలో నడుస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయానికి చేరుకున్న అయోధ్య రామయ్య అక్షింతలకు గురువారం పూజలు చేశారు. కోదండ రామాలయం అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోదండ రామాలయం చైర్మన్ బ్రహ్మండబేరి నరేశ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్స్, ఆర్కిటెక్చర్ల సమావేశం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీనియర్ ఇంజినీర్ రాజగోపాల్

జగిత్యాల టౌన్, డిసెంబరు 28: కేశోరాం ఇండస్ట్రీస్ వారి బిర్లా శక్తి సిమెంట్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్, ఆర్కిటెక్చర్ల సమావేశం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ రీజినల్ హెడ్ నాగరాజు మాట్లాడుతూ బిర్లాశక్తి కాంక్రిట్, బిర్లాశక్తి సూపర్ ప్లస్‌ల నాణ్యత, పనితనాన్ని వినియోగదారులకు ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించారు. నిర్మాణ రంగంలోని మార్పులకు అనుగుణంగా తమ సంస్థ తమ ఉత్పాదకతను, సేవలను మెరుగు పరుస్తుందని చెప్పారు. ఇక్కడ వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్, బ్రాంచ్ సేల్స్ మేనేజర్ అనిల్‌వర్మ, టెక్నికల్ ఇన్‌చార్జి సురేశ్, సేల్స్ టీం సునీల్‌కుమార్, రాజగోపాల్, వేణుగోపాల్ ఉన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర

కోరుట్ల, డిసెంబర్ 28: అయోధ్య రామమందిర నిర్మాణంలో భాగంగా రాములోరి అక్షింతలు గురువారం కోరుట్లకు చేరుకున్నాయి. పట్టణంలోని హనుమాన్ అలయం నుంచి రహదారి మీదుగా పురాతనమైన శ్రీ వేంకటేశ్వరాలయం వరకు ప్రత్యేక వాహనంలో స్వామివారి ఉత్సవమూర్తులను, రాములోరి అక్షింతలను మహిళలు మంగళ హారతులతో ఊరేగించారు. ఇక్కడ వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ సభ్యులు, మహిళలు ఉన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

కోరుట్ల, డిసెంబర్ 28: పట్టణంలోని పద్మశాలీ సంఘం కల్యాణ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, కోటి నవదుర్గా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. రేకుర్తి కంటి వైద్యశాల చైర్మన్ కొండా వేణు మూర్తి, ఉపాధ్యక్షుడు చిదుర సురేశ్ సహకారంతో కంటి వైద్య నిపుణుడు ప్రభాకర్ 75 మందికి కంటి పరీక్షలు చేశారు. 32 మందిని శస్త్ర చికిత్స కోసం రేకుర్తి కంటి హాస్పిటల్‌కు తరలించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్ర మోహన్, కార్యదర్శి కుందారపు మహేందర్, కోశాధికారి కొండబత్తిని అనంత కృష్ణప్రసాద్, మహిళా లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గా అధ్యక్షురాలు వనపర్తి రమ్య, కార్యదర్శి కుందారపు ప్రేమలత, కోశాధికారి కొండ బత్తిని రాధిక, క్లబ్ ప్రతినిధులు గుంటుక చంద్ర ప్రకాశ్, శివ శ్రీనివాస్, అల్లాడి ప్రవీణ్ కుమార్, ఎలిమిల్ల ఉషా కిరణ్, ఆడెపు మధు, చాప కిశోర్, పోల రఘునందన్, ఎక్కల్ దేవి సుధాకర్ పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

వెల్గటూర్, డిసెంబర్ 28: ఎండపల్లి మండలంలోని పాతగూడూర్ గ్రామానికి చెందిన బోయిని లక్ష్మణ్ (40) పిల్లలు పుట్టడం లేదని జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, మృతునికి గతంలో వివాహం కాగ మొదటి భార్యతో విడాకులు తీసుకుని రెండేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి సంతానం కాకపోవడంతో బుధవారం రాత్రి తన ఇంట్లో భార్య బయటకు వెళ్లడం గమనించి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. భార్య ఇంట్లోకి వచ్చేసరికి లక్ష్మణ్ ఉరివేసుకొని కనిపించగా స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారని, ఈ మేరకు భార్య బోయిని పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ కే శ్వేత తెలిపారు.

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం

ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, డిసెంబర్ 28: ఎల్లంపల్లి ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ల్యాండ్ అక్వేషన్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, అటవీ శాఖ అధికారులు ఐదు గ్రామాల ముంపు బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ, ఇండ్లు, భూములు కోల్పోయిన వారి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా స్థానిక నాయకులు, అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ శ్రీనివాసరావు, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో సంజీవరావు, అధికారులు సంతోష్‌రెడ్డి, ఆర్ఐ దొంత రాజేశ్వరి, సర్పంచ్ మేర్గు మురళి, ఎంపీటీసీ రంగు తిరుపతి గౌడ్, శైలేందర్‌రెడ్డి, అధికారులు, ముంపు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రేచపల్లిలో నేషనల్ టీం

రేచపల్లి దవాఖానలో నేషనల్ టీం సభ్యులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్యులు

సారంగాపూర్, డిసెంబర్ 28: మండలంలోని రేచపల్లి పల్లె దవాఖానను గురువారం నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ సిస్టం టీం సభ్యులు పరిశీలించారు. పల్లె దవాఖానలో వసతులు ఎలా ఉన్నాయి..? ఏఏ రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నారు. ఏఏ రకాల టెస్టులు చేస్తున్నారు..? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. దవాఖాన పరిసరాలను వసతులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ సిస్టం టీం సభ్యులు సీఆర్ఎం శర్మ, మాన్‌సింగ్ జెట్, జిల్లా వైద్యాధికారి శ్రీధర్, ఉప వైద్యాధికారులు శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, సాముయోద్దిన్, మండల వైద్యాధికారి రాణిమైత్రి రెడ్డి, అంజిత్ రెడ్డి, సూపర్ వైజర్లు ఉన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

సారంగాపూర్, డిసెంబర్ 28: సహకార సంఘంలో సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కేడీసీబీ డైరెక్టర్, బీర్‌పూర్ సహకార సంఘ చైర్మన్ ముప్పాల రాంచందర్ రావు సూచించారు. బీర్‌పూర్ మండల కేంద్రంలోని సంఘం ఆవరణలో సంఘ కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న, చేపట్టే పలు కార్యక్రమాలపై చర్చించారు. సభ్యులు తీసుకున్న స్వల్పకాలిక రుణాలు, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. తుంగూర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన బ్రాంచ్‌ను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ హరిప్రసాద్, సంఘ ఉపాధ్యక్షుడు కొమురెల్లి, సీఈవో తిరుపతి ఉన్నారు.

దత్త జయంతి ముగింపు వేడుకలు

కోరుట్ల, డిసెంబర్ 28: పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా దేవాలయంలో గురువారం దత్త జయంతి ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి అర్చకులు వినయ్ శర్మ, రమేశ్ శర్మ వైదిక నిర్వహణలో విశేష అభిషేకాలు, పారాయణ సమాప్తి, పూర్ణాహుతి, మండప ఉద్వాసన, కలశ స్థాపన, హారతి తదితర పూజలు జరిపించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. బాబా ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో ఊరేగించగా, మహిళలు కోలాటాలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఇక్కడ ఆలయ కార్యనిర్వాహణాధికారి అనూష, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జడ్పీ జీపీఎఫ్ వ్యక్తిగత అకౌంట్లకు జమ చేయాలి

జగిత్యాల, డిసెంబర్ 29: ఉద్యోగ, ఉపాధ్యాయులు జడ్పీ జీపీఎఫ్ మొత్తాలను ఉపసంహరించుకునే సమయంలో అట్టి మొత్తాలను డీడీవోల అకౌంట్లకు కాకుండా, వ్యక్తిగత అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినపల్లి ప్రసాద్ రావు కోరారు. ఈ మేరకు గురువారం రాత్రి జగిత్యాల జడ్పీ సీఈఓ రఘువరన్, జిల్లా ట్రెజరీ అధికారికి తపస్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు ఈ విషయంపై పూర్తిస్థాయిలో వివిధ జిల్లాల్లో ఈ మేరకు అమలు జరుగుతోందని వివరించి తగు చర్యలు తీసుకోవాలని కోరగా, వారు అనుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

పూడూర్‌ను మండలంగా చేయాలని వినతి

కొడిమ్యాల, డిసెంబర్ 28: పూడూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, ఎంపీడీవో, తహసీల్దార్‌కు మండల సాధన కమిటీ సభ్యులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూడూర్, గౌరాపూర్, నర్సింహులపల్లి, నమిలకొండ, తుర్కాశినగర్, శ్రీరాములపల్లి, తిప్పాయిపల్లి, నల్లగొండ, చెప్యాల, అప్పారావుపేట, గ్రామాలను కలుపుతూ మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల జేఏసీ కన్వీనర్ బండ రవీందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు ఉన్నారు.

పంచాయతీకి బాడీ ఫ్రీజర్ అందజేత

గొల్లపల్లి, డిసెంబర్ 28: శ్రీరాములపల్లి గ్రామ పంచాయతీకి అదే గ్రామానికి చెందిన గడ్డం గంగా రెడ్డి గురువారం బాడీ ఫ్రీజర్ అందిచారు. గంగా రెడ్డి వారి అమ్మనాన్నలు గడ్డం (బంగ్లా) రాజయ్య–గంగవ్వ జ్ఞాపకార్థం వారి కుమారుడు గడ్డం డిష్ గంగా రెడ్డి రూ.1.50 లక్షల విలువైన బాడీ ఫ్రీజర్‌ను సర్పంచ్ నేరెళ్ల గంగా రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా గంగా రెడ్డిని సర్పంచ్ అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆసి రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, వార్డు సభ్యులు రాజి రెడ్డి, అనిల్, దశాగౌడ్, శోభన్ గౌడ్, లక్ష్మణ్, నాయకులు స్వామిరెడ్డి, రమేశ్ రెడ్డి, నర్సింహా రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : దరఖాస్తులు స్వీకరిస్తున్న జడ్పీసీఈవో రఘువరణ్

మల్యాల : మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో దరఖాస్తులు సమర్పిస్తున్న అర్జీదారులు

మొదటిరోజు 30,249 దరఖాస్తులు

■ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభం
■ ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ
■ పలుచోట్ల పరిశీలించిన అధికారులు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 28: జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి తొలి రోజు 30,249 దరఖాస్తులు వచ్చాయని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, ప్రజాపాలన జిల్లా ఇన్‌చార్జి టీఎస్ దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలి రోజు జిల్లాలోని 57 గ్రామాలు, 134 మున్సిపల్ వార్డుల్లో సమావేశాలు నిర్వహించామని, గ్రామ పంచాయతీల్లోని 33,077 గృహాలు, మున్సిపల్ వార్డుల్లోని 74,357 గృహాలను కవర్ చేశామని, తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 30,249 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

చర్లపల్లి, మోతె గ్రామాల్లో

జగిత్యాల రూరల్, డిసెంబర్ 28: చర్లపల్లి, మోతెలో ప్రజాపాలన కార్యక్రమాన్ని తహసీల్దార్ రామ్మోహన్ ప్రారంభించారు. చర్లపల్లి, మోరపల్లి, కండ్లపల్లి, హైదర పల్లి గ్రామాల్లో మొత్తం 702 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ఎంపీడీవో శైలజారాణి, ప్రత్యేకాధికారులు రాజ్‌కుమార్, శ్రీను, జడ్పీటీసీ మహేశ్, సర్పంచులు తిరుపతి, స్వప్నరాజేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

డీఆర్డీవో నరేశ్ పరిశీలన

మల్లాపూర్, డిసెంబర్ 28: రేగుంట, ఓబులాపూర్ ఎస్టీ తండా, వాల్గొండ ఎస్టీ తండా ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో నరేశ్ మాట్లాడుతూ, రేగుంటలో 353, ఓబులాపూర్ ఎస్టీ తండాలో 106, వాల్గొండ ఎస్టీ తండాలో 112 దరఖాస్తులు చొప్పున దరఖాస్తులను వచ్చాయన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కాటిపల్లి సరోజన, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్, సర్పంచులు కుందేళ్ల నర్సయ్య, భూక్యా రజిత, ధరంసోత్ కళావతి, ఎంపీటీసీలు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, క్యాతం సుజాత, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్..

కోరుట్ల, డిసెంబర్ 28: పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ప్రజల నుంచి ఆర్డీవో దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు అన్నం లావణ్య, ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఐతుపల్లి, రాంభద్రునిపల్లి, నర్సింహునిపేటలో

పెగడపల్లి, డిసెంబర్ 28: ఐతుపల్లి, రాంభద్రునిపల్లి, నర్సింహునిపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ ఎంఏ ఫారూఖ్, ఎంపీవో పుల్లయ్య, మల్యాల సీఐ కోటేశ్వర్, ఎస్ఐ సతీశ్, ఏఎస్ఐ సత్తయ్య, ఏఈలు శ్రీనివాస్, శంషేర్ అలీ, సర్పంచులు కొండయ్య, రాజేశ్వర్‌రావు, బాబుస్వామి, వైస్ ఎంపీపీ గంగాధర్, ఎంపీటీసీలు అంజయ్య, రజిత, పంచాయతీ కార్యదర్శులు, సెర్ప్ సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో

వెల్గటూర్, డిసెంబర్ 28: వెల్గటూర్, కోటిలింగాల, ఎండపల్లి మండలంలోని ఎండపల్లి, గుల్లకోట, శానబండ గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఐదు గ్రామాల్లో 2070 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో ఆకుల సంజీవరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు మారం జలేందర్‌రెడ్డి, మేర్గు మురళి, ఉప సర్పంచ్ గుండేటి సందీప్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ శేఖర్, ఎంపీవో శ్రీనివాస్, నాయకులు ఉదయ్, శ్రీకాంత్‌రావు, పూదరి రమేశ్ ఉన్నారు.

ధర్మపురి మండలంలో

ధర్మపురి రూరల్, డిసెంబర్ 28: ధర్మపురి మండలంలోని బోదరి నక్కలచెరువు గూడెం, బుద్దేశ్‌పల్లి, దుబ్బల గూడెం, గాదెపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి మండలంలో 630 దరఖాస్తులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 28: మెట్‌పల్లి మండలంలో 630 దరఖాస్తులు సమర్పించారు. చౌలమద్దిలో 884 కుటుంబాలకు 391 దరఖాస్తులు, పాటిమీది తండాలో 102 కుటుంబాలకు 110, రామారావుపల్లెలో 106 కుటుంబాలకు 129 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా చౌలమద్దిలో పది కౌంటర్లు ఏర్పాటు చేయగా, ప్రక్రియను ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి, పాటిమీది తండాలో తహసీల్దార్ శేఖర్ పర్యవేక్షించారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో 1675 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 28: మండల కేంద్రంతో పాటు ఎర్రాపూర్, తమ్మాపూర్ తండా గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభలను నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో 1406, ఎర్రాపూర్‌లో 172, తిమ్మాపూర్ తండాలో 97 దరఖాస్తులు మొత్తం 1675 వచ్చినట్లు ఎంపీడీవో ప్రభు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో కృపాకర్, ఏపీఎం శంకర్, ఎస్ఐ ఉమాసాగర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో

సారంగాపూర్, డిసెంబర్ 28: సారంగాపూర్ మండలం పోతారం, నాయకపు గూడెం, భీంరెడ్డి గూడెం, బీర్‌పూర్ మండలం బీర్‌పూర్, కందెనకుంట గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు ప్రారంభించారు. బీర్‌పూర్ మండలాల్లో జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి పర్యటించారు కార్యక్రమాన్ని తీరును పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మసర్తి రమేశ్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల ప్రత్యేక అధికారులు మిలింద్, సుదీర్, తహసీల్దార్లు రమేశ్, నరేశ్, ఎంపీడీవో రాజేందర్, ఎంపీవోలు శశికుమార్, రామకృష్ణరాజు, ప్రజాప్రతినిధులు ఢిల్లీ రామారావు, జోగినపల్లి సుధాకర్ రావు, కొత్తూరి రాజేశ్వరి, బుచ్చిమల్లు, గర్షకుర్తి శిల్ప, భీమక్క ఉన్నారు.

రాయికల్ పట్టణం, మండలంలో

రాయికల్, డిసెంబర్ 28: రాయికల్ పట్టణంలోని 1, 5, 9, వార్డులు, మండలంలోని ఆలూరు, ఒడ్డె లింగాపూర్, చెర్లకొండాపూర్, వస్తాపూర్, శ్రీరాంనగర్ గ్రామాల్లో ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. పట్టణంలోని 9వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి పరిశీలించారు. ఇక్కడ ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, మున్సిపల్ చైర్మన్ హనుమాండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, ఎంపీపీ సంధ్యారాణి, జడ్పీటీసీ సభ్యురాలు జాదవ్ అశ్విని ఉన్నారు.

మల్యాల మండలంలో

మల్యాల, డిసెంబర్ 28: మల్యాల, గుడిపేట, గొర్రెగుండం గ్రామాల్లో ప్రజా పాలన సభలను అధికారులు ప్రారంభించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అర్జీలను స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయాధికారి సురేష్‌కుమార్ నేతృత్వంలో కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఎంపీడీవో వెంకటేశం, తహసీల్దార్ మునీందర్, ఎంఈవో అయిత శ్రీనివాస్‌లు గ్రామాల కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కొడిమ్యాల 1841 దరఖాస్తులు

కొడిమ్యాల, డిసెంబర్ 28: కొడిమ్యాల, చింతల్లపల్లి, శనివారంపేట గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. కొడిమ్యాలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మణిదీప్, చింతల్లపల్లిలో తహసీల్దార్ రవికాంత్, శనివారంపేటలో ఎంపీడీవో పద్మజ అర్జీలను స్వీకరించారు. కాగా, కొడిమ్యాల సెంటర్ వద్ద దరఖాస్తు ఫారాలు లేకపోవడంతో ప్రజలు జిరాక్స్ సెంటర్ల వద్ద బారులు తీరారు. ఇదే అదునుగా భావించిన నిర్వాహకులు ఒక్కో కాపీకి రూ.60 తీసుకోగా, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం మూడు గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు 1841, ఇతర దరఖాస్తులు 316 వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఏలేటి మమత–నర్సింహరెడ్డి, మల్యాల మహిపాల్, బందరు ఎల్లవ్వ, ఎంపీవో ప్రవీణ్, ఎంపీటీసీ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి, సామల్ల లక్ష్మణ్, జమల్‌పూరి రాజేశ్వరి ఉన్నారు.

కోరుట్ల మండలంలో 685 దరఖాస్తులు

కోరుట్ల రూరల్, డిసెంబర్ 28 : జోగన్‌పల్లి గ్రామంలో ఎంపీవో నీరజ, సర్ఫరాజ్‌పూర్ గ్రామంలో తహసీల్దార్ కిషన్ ఆధ్వర్యంలో గ్రామస్తుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కాగా ఆర్డీవో రాజేశ్వర్ ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. జోగిన్‌పల్లి గ్రామంలో 537, సర్ఫరాజ్‌పూర్ 98 మొత్తం 685 దరఖాస్తులు వచ్చినట్లు ప్రజాపాలన ప్రత్యేకాధికారి శ్రీనివాస్ తెలిపారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత జువ్వాడి కృష్ణారావు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు దుంపల నర్సు, దానవేని సాయమ్మ, దారిశెట్టి రాజేశ్, జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటి స్వరూప, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొంతం రాజం, నాయకులు బల్వంతారెడ్డి, మహిపాల్‌రెడ్డి, నత్తి రాజ్‌కుమార్, సహదేవ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడిపల్లి, భీమారంలో 1800 మంది దరఖాస్తులు

మేడిపల్లి, డిసెంబర్ 28: మేడిపల్లి కేంద్రంతోపాటు మండలంలోని విలయతాబాద్, పోరుమల్ల, భీమారం మండలంలోని పసునూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో 1800 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, మేడిపల్లి, భీమారం మండలాల తహసీల్దార్లు వసంత, రవికిరణ్ తెలిపారు. మేడిపల్లి మండల కేంద్రంలో 839, పోరుమల్ల గ్రామంలో 619, విలాయతాబాద్ గ్రామంలో 148, భీమారం మండలం పసునూర్ గ్రామంలో 194 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో మెట్‌పల్లి ఆర్డీవో మధు పరిశీలించారు.

కథలాపూర్‌లో 2663 దరఖాస్తులు

కథలాపూర్, డిసెంబర్ 28: కథలాపూర్ మండలం తాండ్యాల, సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో 2663 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో జనార్దన్, తహసీల్దార్ ముంతాజీబొద్దీన్ తెలిపారు. కథలాపూర్ మండల కేంద్రంలో 1044, తాండ్ర్యాలలో 795, సిరికొండలో 824 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో మెట్‌పల్లి ఆర్డీవో మధు పరిశీలించారు.

గొల్లపల్లిలో 1049 అర్జీలు

గొల్లపల్లి, డిసెంబర్ 28: శ్రీరాములపల్లి, గోవింద్‌పల్లి, నందిపల్లి, గంగదేవిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలకు 1049 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో నవీన్ కుమార్ తెలిపారు. తహసీల్దార్ ఆరిఫొద్దీన్, ఎంపీవో సురేశ్ రెడ్డి, ఏఈ ప్రభాకర్ అర్జీలు స్వీకరించారు.

తొలి రోజు... గందరగోళం!

మెట్‌పల్లి, డిసెంబర్ 28: ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను గురువారం ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామాలు, వార్డుల వారీగా దరఖాస్తుల స్వీకరణ వచ్చే నెల 6 వరకు కొనసాగనున్నది. అయితే దరఖాస్తు పత్రాలు కుటుంబాలకు చేరవేయడంలో, కుటుంబాల సంఖ్యకు సరిపడా దరఖాస్తులు అందుబాటులో పెట్టకపోవడంతో పలు చోట్ల ప్రజాపాలన గందరగోళంగా మారింది. మెట్‌పల్లి పట్టణంలోని 26 వార్డులు ఉండగా ఒక్కో వార్డులో కనీసం ఆరు, ఏడు వందల కుటుంబాలు ఉంటాయి. ఒక్కో వార్డుకు కేవలం రెండు, మూడు వందల దరఖాస్తు పత్రాలను మాత్రమే అందుబాటులో ఉంచడంతో దరఖాస్తు పత్రం అందని కుటుంబాల సభ్యులు ఆందోళన చెందాల్సి వచ్చింది. చాలా మంది మీ సేవ, జిరాక్స్ సెంటర్ల వద్దకు పరుగెత్తి దరఖాస్తులను తెచ్చుకున్నారు. మరో వైపు వార్డులో కేటాయించిన పలు కేంద్రాల్లో దరఖాస్తులను పూరించేందుకు ఎవరూ లేకపోవడంతో అర్జీదారులు అవస్థలు పడ్డారు. 4వ వార్డులో ఓ హెడ్‌కానిస్టేబుల్ స్వయంగా తానే అర్జీ పెట్టుకునేందుకు వచ్చిన వారికి దరఖాస్తులను రాసిచ్చారు. ఎస్సారెస్పీ క్యాంపులోని నితిన్ చారిటబుల్ ట్రస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఇక్కడ ఒక్కరే దరఖాస్తులను స్వీకరించడం, దరఖాస్తు పత్రాలను రాసిచ్చేందుకు ఎవరూ లేకపోవడం, ఇరుకైన భవనం కావడంతో ఆరుబయట దరఖాస్తు చేసుకునేందుకు 22వ వార్డుకు చెందిన ప్రజలు అవస్తలు పడ్డారు.